# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- పూర్వోదయ పథకం కింద జిల్లాల అభివృద్ధికి సహకారం అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.
- భారతదేశం గర్వపడేలా అమరావతి రాజధాని నిర్మిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈరోజు జరిగింది.
- దిత్వా తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత పలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.." కార్యక్రమం 128వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

భారతదేశం గర్వపడేలా అమరావతి రాజధానిని నిర్మిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధానిలో ఈరోజు జరిగిన 15 బ్యాంకులు, బీమా సంస్థల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అమరావతిని పూర్తిగా గ్రీన్, బ్లూ సిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. 7 జాతీయ రహదారులు, రైల్వేలైన్లు అమరావతికి కనెక్టు అవుతాయని, విట్, ఎస్ఆర్ఎం, బిట్స్ పిలానీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు అమరావతికి వచ్చాయని చెప్పారు. క్వాంటం వ్యాలీలో క్వాంటం కంప్యూటర్ కూడా ఏర్పాటు చేయబోతున్నామని, ప్లానెటోరియం ఏర్పాటు చేసేందుకు స్థలం కూడా కేటాయించామని తెలిపారు. 2047 సంవత్సరానికి భారత్, ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని, అందులో ఆంధ్రప్రదేశ్ పాత్ర కీలకమని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…32 సెకన్లు)

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈరోజు జరిగింది. పలు కీలక అంశాలపై చర్చించేందుకు మంత్రివర్గం అమరావతిలోని సచివాలయంలో సమావేశమైంది. రాజధాని అమరావతి నిర్మాణానికి రెండో దశలో 7 గ్రామాల్లో16 వేల 666 ఎకరాల భూములను సీఆర్డీఏ ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకునేందుకు ఆమోదం లభించింది. ఈ సమావేశంలో మొత్తం 26 అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

====================

పూర్వోదయ పథకం కింద 9 జిల్లాల అభివృద్ధికి సహకరిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాజధాని అమరావతిలో నిర్మించనున్న వివిధ వాణిజ్య సంస్థలకు, బ్యాంకులకు ఆమె ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి.. పూర్వోదయ పథకం కింద రాయలసీమ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన

ప్రణాళికలను ప్రశంసించారు. 9 జిల్లాల్లోని ఉద్యాన ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల మార్కెట్ లకు తరలించేందుకు వీలుగా సహకరించాలని బ్యాంకులకు సూచించారు. జాతీయ బ్యాంకులు కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలకే పరిమితం కావొద్దని, ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, కోల్డ్ చైన్ లాంటి పరిశ్రమలకు కూడా ఊతమిచ్చి, రైతులకు సహకరించాలని స్పష్టం చేశారు. దేశానికి పౌష్టికాహారం అందించే రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కేంద్రమంత్రి బ్యాంకులకు సూచిస్తూ...

(వాయిస్...32 సెకన్లు)

=====================

విరామం

=====================

దిత్వా తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత పలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ఈ మేరకు తుఫాను ప్రభావం ఎక్కువగా చూపే తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. రేపు, ఎల్లుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎక్కడా పాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

=====================

రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం ఎంతో విలువైనవని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. అమరావతి రాజధానిలో 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొని మాట్లాడుతూ.. బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలతో ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధి జరుగుతుందన్నారు. ఆర్థిక సంస్థల ఏర్పాటుతో రాజధానికి.. ఒక వెయ్యి 328 కోట్ల రూపాయల పెట్టుబడులు రావడంతో పాటు సుమారు 6 వేల 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ప్రతి ఒక్కరికీ కనబడేలా పారదర్శకంగా, జవాబుదారీతనంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...26 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

=====================

వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని వంశధార ప్రాజెక్టు రూపకల్పనలో అత్యంత కీలకమైన నేరేడి బ్యారేజ్ కి ఉన్న సాంకేతిక, న్యాయపరమైన అడ్డంకులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రత్యామ్నాయంగా రిజర్వాయర్లు నింపడానికి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా గొట్టా బ్యారేజీ నుంచి 12 టీఎంసీల నీటిని వంశధార రిజర్వాయర్లలోకి పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నాగావళి, వంశధార నదుల అనుసంధానమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యం నెరవేరితే జిల్లాలో మరింత భూమి సాగులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు.

=====================

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (IFFI) 2025 నేటితో ముగియనుంది. రాట్చపూమ్ బూన్‌బుంచచోక్ రూపొందించిన థాయ్ చిత్రం ఎ యూజ్‌ఫుల్ గోస్ట్ ఉత్సవాలలో చివరి చిత్రంగా ప్రదర్శింపబడుతుంది. ఈ చిత్ర ప్రదర్శన తర్వాత శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో ముగింపు వేడుక జరుగుతుంది. ఈ ఉత్సవంలో ఉత్తమ చిత్రానికి ప్రతిష్ఠాత్మకమైన గోల్డెన్ పీకాక్‌ను ప్రధానం చేస్తారు. ICFT-UNESCO గాంధీ పతకం, సిల్వర్ పీకాక్ అవార్డులు, ప్రత్యేక జ్యూరీ బహుమతితో సహా అనేక ఇతర అవార్డులను కూడా ప్రధానం చేస్తారు.

=====================

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో కర్ణాటక మైనర్ ఇరిగేషన్ మంత్రి ఎన్.ఎస్.బోస్ రాజు ఈరోజు సమావేశమయ్యారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో అంతర్రాష్ట్ర జలవనరులకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్ల ఏర్పాటుకు బడ్జెట్ లో 54 కోట్ల రూపాయలు కేటాయించామని మంత్రి రామానాయుడు ఈ సందర్భంగా తెలిపారు.

=====================

దిత్వా తుఫాను పుదుచ్చేరికి దక్షిణ-ఆగ్నేయంగా 430 కిలోమీటర్ల దూరంలోను, చెన్నైకి దక్షిణంగా 530 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది.

=====================
=====================